# 2016-17 వ్యవసాయ బడ్జెట్ ప్రసంగం

**గౌరవనీయులైన అధ్యక్షా! మరియు సభ్యులారా!**

రైతుబిడ్డ, మాన్యమహోదయులు, మన ప్రియతమ ముఖ్యమంత్రి గౌరవనీయులైన **శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు** రైతు సంక్షేమానికి ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌కు రూపకల్పన చేసారు. రైతును రాజుగా చేసే క్రమంలో ఇదొక చారిత్రాత్మక ఘట్టం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వరుసగా మూడవసారి వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సందర్భంలో సభాధ్యక్షుల వారికి, ప్రతిష్ఠాత్మక సభలోని గౌరవ సభ్యులకు, కర్షకాభివందనాలు!

**చంద్రన్న స్వప్నం – లాభసాటి వ్యవసాయం**
**పాడిపంటల పచ్చదనం – రైతు ఇంట సౌభాగ్యం**

మా ప్రభుత్వం వ్యవసాయం మరియు అనుబంధ శాఖలను "రైతుకోసం" అనే గొడుగు క్రిందకు చేర్చి, మిషన్ విధానంలో ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లటానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నది.

**వ్యవసాయాన్ని తక్కువ వ్యయంతో లాభదాయకంగా అధిక ఉత్పాదనతో సుస్థిరం చేయడం మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.**

కరువు రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే మా లక్ష్యం. వర్షాభావ పరిస్థితుల్లో ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో ఇబ్బంది పడుతున్న రైతులకు నీరందించడానికి నదుల అనుసంధానంతో ప్రతిష్ఠాత్మకమైన పట్టిసీమ ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తిచేసి ప్రారంభించాం.

**ఇదే చంద్రన్న స్వప్న సౌధం**
**చంద్రన్న సంకల్పానికి రైతుల తరపున వందనం! అభివందనం!!**

మత్స్యశాఖకు సంబంధించి 2014–15 సం॥నికి గాను 19.78 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తి, రూ. 22,707 కోట్ల స్థూల ఆదాయ విలువ సాధించి, 22.25% వృద్ధిరేటును నమోదు చేసింది. 2015–16 సం॥నికి ఫిబ్రవరి 2016 నాటికి 21.30 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తి మరియు రూ. 28,280 కోట్ల ఆదాయం సముపార్జించి, 32.61% వృద్ధిరేటును సాధించాము.

ఉద్యానశాఖకు సంబంధించి 2014-15 స్థూల ఆదాయ విలువ కంటే ఉద్యానశాఖ 2015-16 సం॥లో 9.96% వృద్ధి అదనంగా సాధించడం జరిగింది. 2015-16 సం॥నికి గాను ఇప్పటివరకు 75వేల హెక్టార్లలో సూక్ష్మసేద్యం అమలులో ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం చివరకు లక్ష హెక్టార్లలో అమలు చేయుటకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇదే సమయానికి 2014-15 సంవత్సరంలో కేవలం 35 వేల హెక్టార్లలో మాత్రమే సూక్ష్మసేద్యం చేసాం.

**"చీకటిని చీల్చే వెలుతురు కిరణం**
**రైతు ఋణ ఉపశమన పథకం**
**ఇది స్వర్ణాంధ్రలో చారిత్రాత్మక పథం"**

వ్యవసాయ ఋణమాఫీ వాగ్దానాన్ని నెరవేర్చిన మన ప్రియతమ ముఖ్యమంత్రి గౌరవనీయులైన **శ్రీ నారా చంద్రబాబు నాయుడు**గారికి, ఒక రైతుగా రాష్ట్రంలోని రైతులందరి తరపున మరియు ప్రభుత్వం పక్షాన కూడా నా హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను. ఇప్పటివరకు రూ.7,433 కోట్ల మొత్తాన్ని విడుదల చేసి, 35.15 లక్షల మంది రైతు కుటుంబాలకు చెందిన 54.06 లక్షల ఖాతాలలో జమ చేసాం. మిగిలిన ఋణ ఉపశమన అర్హత ఉన్న మొత్తానికి 4 వార్షిక వాయిదాలలో 10% వడ్డీతో సహా ప్రభుత్వమే చెల్లిస్తుంది.

ఉద్యాన పంటలకు కూడా ఎకరానికి రూ.10,000/- వరకు గరిష్ఠంగా రూ.50,000/- వరకు ఒక కుటుంబానికి 5 ఎకరాలకు మించకుండా ఋణమాఫీ వర్తింపచేయుటకు హామీని ఇచ్చాం.

పశువులలో పశుగ్రాస ప్రాముఖ్యతను గుర్తించిన ప్రభుత్వం ఈ సంవత్సరం 'పశుగ్రాస భద్రతా విధానం' రూపొందించింది. దీనివలన పాడిపరిశ్రమకు ఉత్పాదకత పెరుగుతుంది. దీనివలనేగాక, ప్రభుత్వం తీసుకున్న ఇతర ప్రోత్సాహక చర్యలవలన పశు ఉత్పత్తుల స్థూల ఆదాయ విలువ రూ. 34,719 కోట్లకు పెరిగింది. ఇది వ్యవసాయ ఆదాయం (రూ. 31,969 కోట్లు) కన్నా మిన్న. పశుగణ రంగంలో ఈ పురోగమన అభివృద్ధి రైతులను వ్యవసాయంలోని ఒడిదుడుకులను తట్టుకొనేలా కొంతమేరకు తోడ్పడుతుంది.

**మా ప్రభుత్వం 2016-17 సంవత్సరంలో ఈ క్రింది అంశాలపై ప్రత్యేకశ్రద్ధ వహిస్తుంది.**

2016-17 సంవత్సరంలో పెద్ద ఎత్తున "రైతు ఉత్పత్తిదారుల సంస్థ" (Farmer Producers Organisation-FPO)లను నిర్వహించడం ప్రధానాంశంగా ఉన్నది. ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యాన, పాడిపరిశ్రమ, మత్స్యపరిశ్రమల్లో 1000 "రైతు ఉత్పత్తిదారుల సంస్థ"ల ద్వారా 10 లక్షల మంది రైతులను ప్రోత్సహిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతుల ఉత్పత్తి, ఉత్పాదకత, లాభదాయకతను పెంచేందుకు గ్రామస్థాయిలో రైతుల సమూహాలను సమీకరించేందుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (FPO) ఏర్పాటు చేస్తున్నది. పెద్ద స్థాయిలో రైతులను సమీకరించి వారిలో అధునాతన సాంకేతికతతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే మా లక్ష్యం. 'వరల్డ్ ఎకనమిక్ ఫోరం' (WEF) సదస్సులో గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు WEF ప్రతినిధులతో సంప్రదింపులు జరిపారు. తదనుగుణంగా ఈ చర్చల్లో 25 రకాల పంట ఉత్పత్తులలో బహుళజాతి కంపెనీలతో, నిర్దిష్ట అభివృద్ధి ప్రాజెక్టులను తయారుచేసి, రైతుకు ఆదాయాన్ని పెంచే దిశగా ప్రయత్నిస్తున్నాం.

కరువు నివారణ కొరకు 2016-17 సంవత్సరంలో పూర్తిస్థాయిలో ఖరీఫ్ సీజన్‌లో నీరందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. నీటిలభ్యతను పెంచడానికి MGNREGA క్రింద పెద్ద ఎత్తున 'పంట సంజీవని' కార్యక్రమం ద్వారా 'నీటికుంటలు' త్రవ్వి రైతులను ఆదుకుంటాము. అంతేగాక, ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన 'రెయిన్ గన్స్'ను విస్తృతంగా అందుబాటులోకి తెచ్చి, ప్రతీ చుక్క నీటిని ఆదా చేసి మరియు ఇతర నీటి సంరక్షణ పద్ధతులద్వారా పంట నష్టపోకుండా రైతులకు నీరు అందిస్తాము.

వ్యవసాయ, అనుబంధ రంగాలకు ప్రణాళిక వ్యయం క్రింద **రూ. 7691.90** కోట్లు, ప్రణాళికేతర వ్యయం క్రింద **రూ. 8558.68** కోట్లతో 2016-17 ఆర్థిక సంవత్సరంలో మన వ్యవసాయ బడ్జెట్‌ను ప్రతిపాదించడమైనది.

## వ్యవసాయశాఖ

2015-16 సంవత్సరంలో వర్షాభావ పరిస్థితులవలన పంటల విస్తీర్ణం తగ్గింది.

2014-15 సంవత్సరంలో 160.04 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా, సవరించిన 2వ ముందస్తు అంచనా ప్రకారం, 2015-16 కాలంలో 137.56 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తిని అంచనా వేయడమైనది. ఖరీఫ్ కాలంలో నెలకొన్న కరువు పరిస్థితులే గాక 2015-16 నవంబర్‌లో అకాల భారీ వర్షాల వలన చేతికొచ్చిన పంటలు భారీ నష్టానికి గురైనా, ఈ దిగుబడులు సాధించడమైంది. పప్పుధాన్యాల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల సాధించడమైనది. ఇది 2014-15లో 9.5 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా, 2015-16 కాలంలో 33 శాతం పెరుగుదలతో 12.65 లక్షల మెట్రిక్ టన్నులుగా అంచనా వేయడమైనది. అదేవిధంగా నూనెగింజల ఉత్పత్తిలో కూడా 2014-15లో 5.91 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 2015-16లో 47 శాతం పెరుగుదలతో 8.69 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని అంచనా వేయడమైనది.

**2015-16 సంవత్సరంలో వ్యవసాయంలో సాధించిన విజయాలు :**

- ★ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, 4 లక్షల మట్టినమూనాలు సేకరించి విశ్లేషించి 16.25 లక్షల రైతులకు భూ ఆరోగ్యస్థితి తెలిపే కార్డులను భూసార పరీక్ష ఆధారిత సిఫారసులతో పంపిణీ చేసి దేశంలోనే మొదటి స్థానంలో ఉంది.
- ★ సేంద్రియ సాగును ప్రోత్సహించడం ప్రభుత్వం తీసుకున్న చర్యలలో ప్రధానమైనది. 'RKVY' కార్యక్రమం క్రింద, అన్ని జిల్లాల్లో 725 గ్రామాల్లో 1.25 లక్షల రైతులకు ప్రమేయం కల్పిస్తూ 1.25 లక్షల హెక్టార్లలోని 131 సేంద్రియ సాగు సముదాయాలలో (Clusters) ప్రభుత్వం ఒక ప్రాజెక్టును అమలుచేస్తున్నది. ప్రతీ సముదాయంలో ఒక 'రైతు ఉత్పత్తిదారుల సంస్థ' (FPO)ను ప్రోత్సహిస్తాము.
- ★ సాగు వ్యయాన్ని మరియు నష్టాలను తగ్గించడానికి ఉత్పాదకతను పెంచడానికి, వ్యవసాయ జీవనోపాధుల లాభదాయకతను వృద్ధి చేయడానికి **"పెట్టుబడి రహిత సహజసిద్ధమైన సేద్యాన్ని"** (ZBNF) ప్రోత్సహిస్తున్నది. కాకినాడలో 24.01.2016 నుండి 31.01.2016 వరకు "పెట్టుబడి రహిత సహజసిద్ధమైన సేద్యం" అనే అంశంపై శిక్షకుల శిక్షణా కార్యక్రమంలో

8 రోజుల శిక్షణను శ్రీ సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో నిర్వహించాము. ఈ శిక్షణా కార్యక్రమంలో 4275 రైతులు మరియు 945 మంది అధికారులు పాల్గొన్నారు.

- ★ విత్తనాలు, ఎరువులు మరియు వ్యవసాయ పరపతి సకాలంలో రైతులకు అందుబాటులో తీసుకురావడంవలన ఉత్పత్తిలో పెరుగుదల ఏర్పడింది.
- ★ **సామాజిక విత్తన వ్యవస్థ నిర్వహణ** (CMSS) **:** రైతు సంఘాలద్వారా నాణ్యమైన విత్తనాలను గ్రామములోనే ఉత్పత్తి చేసి సకాలంలో రైతులందరికి అందేటట్లుగా అనంతపురం జిల్లాలో ప్రారంభించిన కార్యక్రమం మంచి ఫలితాలనిచ్చింది.
- ★ **ముందస్తు విత్తన సేకరణ :** అనుకూల ధరకు నాణ్యమైన విత్తనాన్ని సకాలంలో సరఫరా చేయడానికి రబీ పంట కోత కాలంలో విత్తనాన్ని సేకరిస్తున్నాము.
- ★ **సమగ్ర చిరుధాన్యాల పునరుద్ధరణ :** చిరుధాన్యాల ఉత్పత్తి మరియు వినియోగాన్ని పునరుద్ధరించటానికి 7 జిల్లాల్లోని 47 మండలాలలోని గిరిజన, మరియు వర్షాధార ప్రాంతాలలో సమగ్ర చిరుధాన్యాల పునరుద్ధరణ పథకాన్ని ప్రారంభించాము. ప్రతీ మండలంలో ఒక "రైతు–ఉత్పత్తిదారుల సంస్థ"ను స్థాపించి, 94 వేల మంది రైతులను ప్రోత్సహిస్తాము.
- ★ ప్రభుత్వం వ్యవసాయ క్షేత్ర యాంత్రీకరణపై దృష్టి సారించి రైతులకు వ్యవసాయ పరికరాలను మరియు కస్టమ్ హైరింగ్ కేంద్రాలకు సరఫరా చేస్తూ రూ. 118.00 కోట్లు ఖర్చు చేసాము.
- ★ ప్రతీ 1000 హెక్టార్ల సాగు చేయదగు విస్తీర్ణానికి ఒకరు చొప్పున 4354 మంది బహుళ ప్రయోజన విస్తరణ అధికారులను (MPEOs) విస్తరణ నిమిత్తం నియమించాము.
- ★ "పొలం పిలుస్తోంది" అనే కార్యక్రమాన్ని 2015–16లో కొనసాగిస్తూ 16.5 లక్షల మంది రైతులకు అవగాహన కల్పించడానికి 61,405 గ్రామ సందర్శనలు నిర్వహించాం. తద్వారా చీడపీడల ఉధృతిని అధిగమించడానికి సకాలంలో సరైన సలహాలు, సూచనలు ఇవ్వడం వలన తగు పరిష్కార చర్యలు చేపట్టడానికి ఈ సందర్శనలు దోహదపడ్డాయి.
- ★ చంద్రన్న రైతు క్షేత్రాలను 48,990 హెక్టార్లలో ఉత్తమ యాజమాన్య పద్ధతులను ప్రదర్శించడానికి నిర్వహించాము.

★ రైతులు సకాలంలో పెట్టుబడుల నిమిత్తము రూ. 45,512 కోట్లు పంట ఋణాలు మరియు రూ. 13,018 కోట్ల దీర్ఘకాలిక ఋణాలు బ్యాంకుల ద్వారా పరపతి సౌకర్యాన్ని కల్పించాము.

★ మా ప్రభుత్వం కౌలు రైతులకు ఋణ అర్హత కార్డులను జారీచేస్తూ, రూ. 218.81 కోట్ల మొత్తం పంట ఋణాలను 2015-16లో 95,299 మంది కౌలు రైతులకు పంపిణీ చేసాము.

**అధ్యక్షా!**

ప్రభుత్వం రైతన్న కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యంగా రైతు ఋణ ఉపశమన పథకంపై అవగాహన కల్పించటం మరియు ప్రభుత్వానికి - రైతాంగానికి వారధిగా ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్తలను రైతుల వద్దకే నేరుగా రప్పించి, వారిచేత ఆధునిక సేద్య విధానాలను, యంత్ర పరికరాల వినియోగాన్ని వివరించడానికి ఉద్దేశించిన కార్యక్రమమే **"రైతుకోసం చంద్రన్న".** రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం 2015, సెప్టెంబర్ 9 నుండి 30 వరకూ దిగ్విజయంగా జరిగింది. లక్షలాది మంది రైతులతో సదస్సులు, సభలు, సమావేశాలు జరిగాయి. ఈ స్పందన అపూర్వం, స్ఫూర్తిదాయకం.

సాగు ఖర్చును తగ్గించి వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి, వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేయడానికి మా ప్రభుత్వం 2016-17లో ఈ క్రింది అంశాలపై శ్రద్ధ వహిస్తుంది.

ఎ) అధిక దిగుబడినిచ్చే మేలురకపు విత్తనాలను ప్రవేశపెట్టి రైతులకు ఆధునిక పద్ధతులలో శిక్షణనిచ్చి ఉత్పాదకతను పెంచుట.

బి) భూసారాన్ని పరిరక్షించడానికి సూక్ష్మపోషకాలను రైతులకు రాయితీపై అందించుట.

సి) సేంద్రియ/సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించుట.

డి) వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడడానికి 'పంట సంజీవని' పథకం ద్వారా నీటికుంటల్ని ప్రోత్సహించుట మరియు 'రెయిన్ గన్స్' వాడుట.

ఇ) సకాలంలో రైతుకు ఎరువులు మరియు విత్తనాలు (Buffer Seed Stocking System) అందజేయుట.

**అధ్యక్షా!**

★ 2016–17లో వ్యవసాయం కోసం ప్రణాళిక వ్యయం క్రింద **రూ. 1311.77** కోట్లు, ప్రణాళికేతర వ్యయం క్రింద **రూ. 4474.46** కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించాము. వ్యవసాయంలో లక్ష్యంగా నిర్ణయించిన పెరుగుదలను సాధించడానికి ఈ బడ్జెట్ కేటాయింపు ఉపయుక్తంగా ఉంటుంది.

★ భూసార అంశాన్ని మెరుగుపరచడం కోసం సమగ్ర పోషక యాజమాన్యం నిర్వహణలో భాగంగా సూక్ష్మపోషకాల సరఫరా చేయుటకై **రూ. 80** కోట్ల మొత్తాన్ని సమకూరుస్తాము.

★ ప్రభుత్వం సుస్థిర వ్యవసాయ జీవనోపాధులను ఏర్పాటు చేయడానికి సాగు ఖర్చును తగ్గించడానికి సేంద్రియ మరియు సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం మేము బడ్జెట్‌లో **రూ. 68.67** కోట్లను సమకూరుస్తున్నాము.

★ పెరుగుచున్న వ్యవసాయ యంత్రాల డిమాండ్ కోసం ఈ సంవత్సరంలో వ్యవసాయ క్షేత్ర యాంత్రీకరణ కోసం **రూ. 161.25** కోట్ల మొత్తాన్ని కేటాయించాము.

★ కరువును తట్టుకొనే రకాలను అభివృద్ధి చేయడం, మిశ్రమపంటలు, అంతరపంటలు, వనరుల సంరక్షణ సాంకేతికత అనుసరించడం, రైతులకు సంస్థాగత మద్దతును అందించడం ద్వారా సమగ్ర కరువు నివారణ చర్యలు చేపడతాం. ఇందుకోసం **రూ. 50** కోట్లను సమకూర్చాము.

★ వ్యవసాయశాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతర సామర్థ్య పెంపునకు, విస్తరణ కార్యక్రమాల నిర్వహణకోసం ఈ బడ్జెట్‌లో **రూ. 61.71** కోట్ల మొత్తాన్ని కేటాయిస్తున్నాము.

★ అధిక ఉత్పాదకతకోసం, "పొలం పిలుస్తోంది" అనే విస్తరణ కార్యక్రమాన్ని, "చంద్రన్న రైతు క్షేత్రాలు" వంటి సముదాయ ప్రదర్శనలను మా ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందుకోసం ఈ సంవత్సరం **రూ. 17.50** కోట్లను కేటాయించాము.

★ క్షేత్ర స్థాయి విస్తరణ ఉద్యోగులందరికీ 6000 'ట్యాబ్'లను సమకూర్చడమయింది. వీటిద్వారా పంట విస్తీర్ణం, రైతువారీగా, సర్వే నెంబరు వారీగా నమోదు చేస్తాము.

★ సకాలంలో అవసరమైన పరిమాణంలో రసాయన ఎరువులు సరఫరా అయ్యేలా చూడటానికి అత్యవసర నిల్వలను నిర్వహించేందుకు **రూ. 64.50** కోట్ల బడ్జెట్‌ను కేటాయించాము.

★ మంచి నాణ్యత కలిగిన విత్తనాలను సకాలంలో సరఫరా అయ్యేలా చూడటానికి వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇతర కేంద్ర సంస్థల సమన్వయంతో నాణ్యమైన విత్తనాలను అభివృద్ధి మరియు ఉత్పత్తి చేసేందుకు మా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. ఇందుకోసం **రూ. 160.00** కోట్ల కేటాయింపును చేయాలని ప్రతిపాదించాము.

★ వడ్డీలేని మరియు పావలా వడ్డీ ఋణాలు రాయితీకోసం **రూ. 177.00** కోట్లను ప్రతిపాదించాము.

★ పంటల బీమా పథకాన్ని రైతుకు మరింత సానుకూలమైనదిగా చేయడానికి "ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన" (PMFBY) అనే పంటల బీమా పథకాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అమలు చేస్తాం. దీనితోపాటు వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని కొనసాగిస్తాం. దీనికోసం **రూ. 344.00** కోట్ల మొత్తాన్ని కేటాయించాము.

ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రైతు ఋణ ఉపశమన పథకంలో రెండవ వాయిదా చెల్లింపుల నిమిత్తం **రూ. 3512.00** కోట్ల మొత్తాన్ని సమకూర్చాము. ఉద్యానశాఖకు 2015-16 సంవత్సరంలో రూ.550.00 కోట్లు మంజూరు చేయడం జరిగింది.

## ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

లామ్, గుంటూరులో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకుగాను కేంద్ర ప్రభుత్వం వారు 81.40 కోట్ల రూపాయలను విడుదల చేసారు. 16.11.2015న గౌరవ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి, గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మరియు రాష్ట్ర మంత్రుల సమక్షంలో లామ్ ఫారం, గుంటూరు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. లామ్, గుంటూరు క్యాంపస్‌లో 'అడ్వాన్స్‌డ్ పి.జి. సెంటర్'ను 01.08.2015 నుండి ప్రారంభించాం.

వ్యవసాయ కోర్సులపట్ల మరియు వ్యవసాయ పట్టభద్రుల పట్ల పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో 2016-17 విద్యా సంవత్సరం నుండి అన్ని డిగ్రీ కోర్సులలో 25% సీట్లను పెంచాము.

ఈ సంవత్సరంలో వరి (MTU1121 మరియు MTU1153), కంది – (LRG 52 – అమరావతి), మినుము (LBG 787 – తులసి), సెనగ (NBeG 47 మరియు NBeG 119), ప్రత్తి (NDLH1938 – శ్రీరామ), చెరకు (2000A225 – రేవతి & 2000A255 – సింహాద్రి) మరియు పొగాకు (NBD 119 – నంద్యాల పొగాకు1 ) మొదలగు 10 వంగడాలను విడుదల చేసారు. వివిధ పంటల్లో 30 రకాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

రాష్ట్ర విభజన అనంతరం, రాష్ట్ర రైతాంగం అవసరాలకు అనుగుణంగా కేంద్రప్రభుత్వం వారు 5 అఖిల భారత సమన్వయ పరిశోధన పథకాలను అనగా జీవ నియంత్రణ (అనకాపల్లి); వ్యవసాయ యంత్ర పరికరాలు (బాపట్ల); వేరుసెనగ (తిరుపతి); అపరాలు (ఘంటసాల) మరియు చిరుధాన్యాలు, జొన్న (బాపట్ల) మంజూరు చేసారు. ఈ పథకాలు 1.04.2015 నుండి అమలవుతున్నాయి.

వేరుసెనగ పరిశోధనా సంచాలనాలయం (ICAR) వారి ప్రాంతీయ కేంద్రాన్ని అనంతపురంలో ప్రారంభించాము. జాతీయ వరి పరిశోధనా సంస్థ (ICAR) వారు శ్రీకాకుళం జిల్లాలో ఒక కొత్త ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

## ఉద్యానశాఖ

రాష్ట్ర ఆదాయానికి ఉద్యాన పంటల సహకారం రూ. 41,478 కోట్లు. రాష్ట్ర స్థూల ఆదాయ విలువలో ఉద్యాన శాఖ వాటా 7.4%. ప్రధానంగా మామిడి, అరటి, నిమ్మ, ఆయిల్‌పామ్, కొబ్బరి, టమోటా, ఉల్లి, పసుపు, మిరప మరియు ధనియాలు మొదలగు పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయబడుచున్నవి. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ఆయిల్‌పామ్, మామిడి, టమోటా అరటి, మిరప మరియు పసుపు ఉత్పత్తిలో మొదటి స్థానంలోనూ, పూల ఉత్పత్తిలో రెండవ స్థానంలోనూ ఉన్నది.

**ప్రాథమికరంగ మిషన్ ద్వారా ఉద్యాన శాఖ ప్రగతికి అనుసరిస్తున్న వ్యూహాలు :**

1. నూతన రకాలైన అధిక దిగుబడినిచ్చే పండ్ల తోటల సాగును ఎక్కువ విస్తీర్ణంలో ప్రోత్సహించడం.
2. కూరగాయల సాగులో అధిక ఉత్పత్తి మరియు నాణ్యత పెంచడం.
3. ఉద్యానపంటలను విక్రయించుటకు రైతులకు కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి వాహనాలను అందజేయడము.
4. ఆయిల్‌పామ్ విస్తీర్ణము పెంచడము.
5. విభిన్నమైన ఉద్యానపంటల సాగును ప్రోత్సహించడము.
6. ఉద్యాన పంటలలో కోత అనంతర కార్యక్రమాల ద్వారా ఫలసాయ నష్టాన్ని తగ్గించడం, మరియు ఎగుమతులను ప్రోత్సహించడానికి గాను ప్యాకింగ్ సదుపాయాలు కల్పించుట, శీతల గిడ్డంగులు మరియు రైపనింగ్ చాంబర్స్ ప్రోత్సహించడం.
7. అధిక ఉత్పత్తికి బిందు మరియు తుంపర సేద్యం, ఫెర్టిగేషన్ పద్ధతులను ప్రోత్సహించడం.
8. నీటికుంటలు ఏర్పాటు చేసి కరవు పరిస్థితులను నివారించడం.
9. రైతు – ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయడం మరియు ఉద్యానశాఖ ద్వారా అమలు అవుతున్న పథకాలను సంఘాలకు అందించడం.
10. అధిక ధర పలికే కూరగాయలు మరియు పూల సాగును రక్షిత సేద్యం ద్వారా ప్రోత్సహించడము.

11. విస్తరణ మరియు శిక్షణా కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించడం.

12. ప్రతి మండలంలోను ఒక నమూనా ఉద్యాన క్లస్టర్‌ను అభివృద్ధి చేయడం.

13. వర్షపు నీటిని సేకరించడము మరియు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం.

14. నూతన పండ్ల రకాల సాగును రాష్ట్రంలోని అనువైన ప్రాంతాలలో ప్రోత్సహించడం.

ప్రాథమిక రంగ మిషన్ (రైతుకోసం) ద్వారా రెండంకెల వృద్ధిరేటు సాధించుటలో ఒక ముఖ్యమైన గ్రోత్ ఇంజన్‌గా ఉద్యానశాఖను గుర్తించి ప్రాముఖ్యత కల్పించటమైనది. రాష్ట్ర ప్రణాళిక పథకం ద్వారా ముఖ్యంగా రక్షిత సేద్యం, సమగ్ర కోత అనంతర యాజమాన్యం, కూరగాయ పంటలు పండించే రైతులను సమూహాలుగా ఏర్పాటు చేసి తద్వారా వారు పండించే కూరగాయలను దగ్గరలోని రైతుబజార్లలో విక్రయించటం, ఉద్యాన యాంత్రీకరణ మరియు సేంద్రియ వ్యవసాయము మొదలగు నూతన కార్యక్రమాలను అమలుపరచుటకు గాను రాష్ట్రప్రభుత్వం **రూ. 102.00** కోట్లు కేటాయించాము.

అదేవిధంగా 'సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్' పథకం ద్వారా ఉద్యాన పంటల సమగ్ర అభివృద్ధికి **రూ.95.33** కోట్లు మంజూరు చేయబడినవి. ఈ కార్యాచరణ పథకములో కోత అనంతర యాజమాన్యం, గ్రీన్ హౌస్‌లలో పంటల సాగు, నీటి కుంటల ద్వారా వర్షపు నీటి సంరక్షణ, యాంత్రీకరణ మరియు తదితర అంశములు ప్రణాళికలో పొందుపరచడమైనది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కృషి శించాయి యోజన పథకం (PMKSY) ద్వారా బిందు మరియు తుంపర్ల సేద్యం అమలు పరచుటకుగాను **రూ. 369.58** కోట్లు కేటాయించాము.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంద్వారా కూరగాయల ఉత్పత్తి, నాణ్యత పెంచుటకు కూరగాయల పందిర్లు, ట్రెల్లీస్, సంకర జాతి కూరగాయల విత్తనాలు, ప్లాస్టిక్ క్రేట్స్ రైతులకు రాయితీపై అందజేయటము మరియు పండ్లతోటల విస్తరణ, జిల్లా కేంద్రాలు మరియు చిన్న నగరాల దగ్గర ఉన్న రైతులను సమూహాలుగా ఏర్పరచి కూరగాయల పెంపకమును ప్రోత్సహించటము జరిగినది.

**నేషనల్ మిషన్ ఫర్ ఆయిల్ సీడ్ మరియు ఆయిల్‌పామ్ మినీ మిషన్-II** పథకంద్వారా పామాయిల్ తోటల సాగు ప్రోత్సహించుటకు గాను **రూ. 55.09** కోట్లు మంజూరు చేయడమైనది.

## పట్టుపరిశ్రమ

పట్టుపరిశ్రమ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యంగా కరవు పీడిత ప్రాంతాలైన చిత్తూరు, అనంతపురము, కర్నూలు జిల్లాలలో అధికంగా సాగు చేయుచున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 57,333 రైతులు 74,238 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంత రైతులకు ముఖ్యంగా మహిళలకు ఉపాధి కలుగుచున్నది. ప్రస్తుతం మన రాష్ట్రం, పట్టు ఉత్పత్తిలో దేశంలో రెండవ స్థానంలో కలదు.

**లక్ష్యం :**

- పట్టుగూళ్ళు మరియు పట్టు దారము ఉత్పత్తిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా ఉంచడము, అంతర్జాతీయ స్థాయి నాణ్యత గలిగిన పట్టు దారం ఉత్పత్తి చెయ్యడం.
- ప్రత్యామ్నాయ మరియు వాణిజ్య పంటగా ప్రోత్సహించడం మరియు పేదరిక నిర్మూలనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచి ముఖ్యంగా మహిళలకు ఉపాధి కల్పించడం.

**2015-16 సంవత్సరంలో సాధించిన ప్రగతి :**

- ప్రస్తుతం 74,238 ఎకరాలకు మల్బరీ విస్తీర్ణం పెంచడం వలన 3 లక్షల 66 వేల మందికి ఉపాధి కలుగుచున్నది. రాష్ట్రంలో 3946 మెట్రిక్ టన్నుల బైవోల్టైన్ పట్టుగూళ్ళ ఉత్పత్తి చేసి, గత సంవత్సరం కంటే ప్రస్తుతం 22.42% పెరుగుదల వృద్ధిరేటును సాధించడమైనది.
- బైవోల్టైన్ పట్టు దారము ఉత్పత్తి 2015-16 సంవత్సరంలో 607 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేసి, గత సంవత్సరం కంటే 22.70% పెరుగుదల వృద్ధిరేటును సాధించడమైనది.
- పట్టుపరిశ్రమ శాఖలో మొట్టమొదటిసారి మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకమును అమలు పరచి, క్రొత్తగా 5029 ఎకరాలలో మల్బరీ తోటలను సాగు చేసిన రైతులకు రూ.3.53 కోట్ల ఆర్థిక సహాయము అందివ్వడము జరిగినది.

**2016-17 సంవత్సరం కొరకు ప్రతిపాదిత ప్రణాళిక మరియు ప్రణాళికేతర బడ్జెట్ వివరములు:**

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2016-17లో ప్రణాళిక బడ్జెట్ క్రింద **రూ. 25.60** కోట్లు కేటాయించాము.
- 2016-17 సంవత్సరానికి గాను **రూ. 121.56** కోట్లు ప్రణాళికేతర బడ్జెట్ క్రింద కేటాయించాము.

**పశుసంవర్థకశాఖ**

**2015-16 సం॥లో సాధించిన ప్రగతి :**

1. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 62.54 లక్షల కుటుంబాలు పశుపోషణను చేపట్టి ఉన్నారు.
2. 2015-16 ఆర్థిక సంవత్సరంలో పశు ఉత్పత్తుల విలువ రూ. 49,361 కోట్లు. దీని విలువ రాష్ట్ర స్థూల ఆదాయములో 8.85 శాతం.
3. గుడ్ల ఉత్పత్తిలో (1309.79 కోట్లు) ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. దేశంలో ఉత్పత్తయ్యే ప్రతి ఐదు గుడ్లలో ఒకటి మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతోంది. అదేవిధంగా 5.28 లక్షల మెట్రిక్ టన్నుల మాంసం ఉత్పత్తి చేస్తూ దేశంలో 4వ స్థానంలో ఉన్నాము. 96.56 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తితో దేశంలో 6వస్థానంలో ఉన్నాము. 2022 సంవత్సరానికి దేశంలో మొదటి మూడు స్థానాలలో నిలవాలన్న లక్ష్యంతో ఉన్నాము. రానున్న ఆర్థిక సంవత్సరంలో 12 శాతము అభివృద్ధిరేటును సాధించాలన్న కృతనిశ్చయంతో ఉన్నాము.
4. రాష్ట్రంలో ఉన్న పశుగ్రాస కొరత ఉన్న కారణంగా "పశుగ్రాస భద్రతా విధానం - 2015"ని ఆమోదించి పిపిపి పద్ధతి ద్వారా పశుగ్రాసం ఉత్పత్తి మరియు నిల్వ కార్యక్రమాన్ని చేపట్టి పశుగ్రాసం కొరతలేని స్థితిని తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసింది.
5. పాడిపశువుల ఉత్పత్తిని పెంచడానికి, బహుశా దేశంలోనే మొదటిసారిగా రూ. 28.60 కోట్లతో ప్రాథమిక సెక్టారు మిషన్ క్రింద, ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో 2.50 లక్షల క్వింటాళ్ల సైలేజ్ బేల్స్, లక్ష క్వింటాళ్ల టిఎంఆర్ గడ్డి బ్లాకులు సరఫరా కొరకు ఒప్పందం చేసుకోవడం జరిగింది.

6. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి రైతులకు పశుపోషణ మరింత లాభదాయకంగా ఉండేందుకుగాను 2 రూపాయలకే కిలో సైలేజ్, కిలో 3.50 రూపాయలకు టిఎంఆర్ గడ్డి బ్లాకులను రైతులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనితోపాటు గతంలో అమలులో ఉన్న రూ. 3/-కి కిలో ఎండుగడ్డి, రూ. 4/-కి కిలో దాణా పథకాన్నీ కొనసాగిస్తాం.

7. 2015-16లో ఉన్న 2 పాడిపశువుల యూనిట్‌ను 25కు, 5+1 గొర్రెల యూనిట్‌ను 500+25కు పెంచి వీటి యూనిట్ ధరను ప్రస్తుత మార్కెట్ ధరతో పునరుద్ధరించాము.

8. పశుసంవర్ధక శాఖలో విస్తరణ కార్యక్రమాలను విస్తృత పరచడానికి (417) MPDEA లను నియమించడంతోపాటు, (351) మంది పశువైద్య సహాయకులను మరియు (93) మంది పశువైద్యులను నియమించడం జరిగింది.

9. రూ. 25 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో దేశీయ పశు సంపదను పరిరక్షించే ఉద్దేశంతో నెల్లూరు జిల్లా చింతలదీవి Composite Livestock Farm నందు 250 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగింది.

10. A2 పాల ఉత్పత్తిని చేసేందుకు గిర్, సాహివాల్ లాంటి దేశీయ పాడి పశువుల పెంపకాన్ని ప్రోత్సహించుటకుగాను ఆయా జాతి పశువులు లభ్యమయ్యే రాష్ట్రాల నుండి రవాణా మరియు బీమా కొరకు ఒక్కొక్క పశువుకు రూ.10,000/- సబ్సిడీని ఇస్తున్నాం.

11. రాష్ట్రంలో అధిక పాల ఉత్పత్తి చేస్తున్న 400 గ్రామాలను ఎన్నుకొని, వీటిలో పాల ఉత్పత్తిని రెట్టింపు చేసేందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూరుస్తూ పాడిపరిశ్రమను అభివృద్ధి చేయాలని నిర్ణయించాము. ఇందుకుగాను MGNREGS పథకం ద్వారా పెద్ద ఎత్తున పశు గ్రాస ఉత్పత్తిని ప్రోత్సహిస్తాం.

12. ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక కింద దూడల పెంపకం ద్వారా 9233 మంది ఎస్సీ లబ్దిదారులు, ఎస్టీ కార్యాచరణ ప్రణాళిక నందు మినీ గొర్రెల పథకం ద్వారా 359 ఎస్టీ రైతులు లబ్ది పొందారు.

**2016-17 సం॥లో ప్రతిపాదించబడిన ముఖ్య కార్యక్రమాలు :**

1. ప్రాథమిక రంగ లక్ష్య సాధనలో భాగంగా రెండంకెల వృద్ధి సాధించి 2016-17లో పాడిరంగంలో 13 శాతం, మాంసం ఉత్పత్తిలో 12 శాతం మరియు గుడ్ల ఉత్పత్తిలో 11 శాతం మొత్తంగా 12 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యం చేయడమైనది.
2. పశు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించుటకు 155 'రైతు-ఉత్పత్తిదారు సంస్థ', సన్న జీవాలు మరియు పాడిపరిశ్రమ రంగమునందు ప్రోత్సహించాలని ప్రతిపాదించాము.
3. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే ఆలోచనతో 5 లక్షల రైతులకు "Ration Balancing Programme"ను పరిచయం చేయాలని ప్రతిపాదించాము.
4. పిపిపి పద్ధతిలో 792 గ్రామాలకు పశువైద్య సేవలను అందుబాటులోకి తెచ్చే ఆలోచనతో "ఎన్‌టిఆర్ సంచార పశువైద్య సేవలు" పథకాన్ని ప్రతిపాదిస్తున్నాం.
5. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలో కూడా పశుసంపద సంబంధిత అన్ని రంగాల్లో వ్యాపారాన్ని, ఔత్సాహిక గ్రామీణ వ్యాపారస్తులను ప్రోత్సహించేందుకు పిపిపి పద్ధతిలో "Incubation Centres" ను ప్రారంభించాలని ప్రతిపాదిస్తున్నాం.
6. జిల్లాకొక 'పశు వసతి గృహాన్ని" ఏర్పాటుచేసే ఉద్దేశ్యంతో ఇంతవరకు (4) జిల్లాల్లో (కర్నూలు, ప్రకాశం, కృష్ణా మరియు తూర్పు గోదావరి) స్థల సేకరణ చేసి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నాం.
7. గిరిజనాభివృద్ధి పథకం క్రింద 12900 గిరిజనులు లబ్ది పొందే విదంగా రూ. 717 లక్షల నిధులతో "మనకోడి" పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నాం.
8. 2016-17 ఆర్థిక సంవత్సరానికి పశుసంవర్థక శాఖకు రూ. 819.35 కోట్లు కేటాయించాలని ప్రతిపాదిస్తున్నాం.
9. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల పశుసంపదను మెరుగుపరచేందుకు వివిధ పశువుల అభివృద్ధి పథకాల అమలులో భాగంగా ఎస్సీ ఉప ప్రణాళిక క్రింద రూ. 59.59 కోట్లు మరియు ఎస్టీ ఉపప్రణాళిక కింద రూ. 20.86 కోట్లు ఉపయోగించాలని ప్రతిపాదించాము.

## మత్స్యశాఖ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 974 కి.మీ. తీర ప్రాంతాన్ని, 1 లక్షా 74 వేల ఉప్పునీటి వనరులు, సుమారు 8 లక్షల హెక్టార్ల మంచినీటి వనరులు కలిగి దేశ మత్స్యపరిశ్రమలో ప్రధాన భూమికను పోషించుచున్నది. రాష్ట్రంలో రెండంకెల సమ్మిళిత వృద్ధిని సాధించడానికి మత్స్య పరిశ్రమను ఒక ముఖ్యమైన వృద్ధికారకముగా గుర్తించడమైనది. మత్స్యపరిశ్రమ ప్రజల సామాజిక ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర వహించుటయే కాక రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 6.04% వాటాను కలిగియున్నది. ఈ రంగము సుమారు 14.5 లక్షల మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తూ, పోషకాహారం సరఫరా మరియు విదేశీమారక ద్రవ్యం ఆర్జించుటలో ప్రముఖ పాత్ర వహించుచున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేపలు, రొయ్యల ఉత్పత్తిలోనూ, మరియు విలువలోనూ దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నది. 2015-16 సంవత్సరమునకు గాను 22.67 లక్షలు టన్నుల చేపలు ఉత్పత్తి మరియు రూ. 30,099 కోట్ల ఆదాయము సముపార్జించుట లక్ష్యంగా నిర్దేశించుకోవడమైనది. ఫిబ్రవరి 2016 నాటికి రూ.28,280 కోట్ల విలువగల రూ.21.30 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి సాధించడమైనది. 2016-17 సంవత్సరానికి 26.40 లక్షల టన్నులు చేపలు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకోవడమైనది. 2014-15 సంవత్సరానికి గాను దేశ సముద్ర మత్స్య ఎగుమతులద్వారా రూ.33,441 కోట్లు సముపార్జించగా, రాష్ట్రం ద్వారా రూ.14,000 కోట్లు విదేశీమారకద్రవ్యం ఆర్జించడం ద్వారా 42% వాటా కలిగియున్నది.

ఈ ప్రగతి సాధనకై రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలైన ఆక్వా కల్చర్ చెరువులకు 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్తు సరఫరా, ఎల్.టి. విద్యుత్ యూనిట్ విలువ రూ.4.63 లకు వర్తింపు, క్షేత్రస్థాయిలో చేపలు, రొయ్యల పెంపకంలో అనుసరించవలసిన మంచి యాజమాన్య పద్ధతులకై నిరంతర పర్యవేక్షణ, శిక్షణా కార్యక్రమాల ఏర్పాటు, మంచినీటి వనరుల్లో పెద్ద సైజు గల చేపపిల్లలను అధిక సాంద్రతలో విడుదల చేయుట, చెరువుల క్రమబద్ధీకరణకు సంబంధించిన నిబంధనలను సరళీకృతం చేయడంద్వారా హెచ్చు నీటి విస్తీర్ణమును ఆక్వాకల్చర్ పరిధిలోనికి తీసుకురావడం, సముద్రంలో వేట చేసే మత్స్యకారులకు ఇంజన్లు, లోతట్టు సముద్రంలో ట్యూనా చేపల వేటకు ఉపయోగపడే వలలు, ప్రాణరక్షణ మరియు నౌకాయాన పరికరముల సరఫరా, సముద్రంలో మత్స్యకారుల వేట నిషేధ కాలంలో సంక్షేమ మరియు సహాయక పథకము క్రింద

ఒక్కొక్క మత్స్యకారుల కుటుంబానికి రూ.2000/- చొప్పున నేరుగా 59,520 కుటుంబాలకు లబ్ధి చేకూర్చుట, సముద్రంలో మత్స్యకారులకు డీజిల్ ఆయిల్ సరఫరాలో అమ్మకపు పన్ను మినహాయింపు పథకము క్రింద రూ.714.20 లక్షలు మంజూరు, షెడ్యూల్డు కులముల ఉ పప్రణాళిక అమలుకుగాను రూ.958.61 లక్షలు మరియు షెడ్యూల్డు తెగలు ఉపప్రణాళిక క్రింద రూ.72.50 లక్షలు వ్యయము, ఖర్చు చేయడమైనది.

జలాశయాలలో మత్స్య అభివృద్ధికి గాను రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం క్రింద రూ.1109 లక్షల రూపాయలతో జలాశయములలో చేపపిల్లలు, రొయ్య పిల్లలు విడుదల చేయుట, కేజ్‌లలో చేపల పెంకమునకుగాను 19 జలాశయములను గుర్తించి అందు 9 జలాశయములలో కేజ్‌ల ఏర్పాటు వంటి కార్యక్రమాలను చేపట్టుటకు 2014-15 సం॥లో కేటాయించిన బడ్జెట్ రూ.30 కోట్ల నుండి 2015-16 సం॥నకు రూ.187 కోట్లకు బడ్జెట్ పెంచి, మత్స్య ఉత్పత్తులను గణనీయంగా సాధించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నది.

250 బహుళ ప్రయోజక మత్స్య విస్తరణ సహాయకులను, కాంట్రాక్టు ప్రతిపాదికన వివిధ జిల్లాలలో నియమించడమైనది. ఆక్వా రైతులకు విస్తరణ సేవలు మరింత పెంపొందించడానికి టోల్-ఫ్రీ నెం. (1800-425-1188)ను ప్రవేశపెట్టడమైనది. ఆంధ్రప్రదేశ్‌ను ఆక్వా హబ్‌గా మార్చుటకు ప్రభుత్వం వివిధ ప్రోత్సాహకాలను అందించుటకు ఆంధ్రప్రదేశ్ మత్స్య విధానమును 2015ను విడుదల చేయడమైనది.

## శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయము

**మానవ వనరుల అభివృద్ధి :** విశ్వవిద్యాలయంలో 300 పట్టభద్రులు, 120 పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 30 డాక్టరేట్లు మరియు 250 డిప్లొమా విద్యార్థులను ప్రతీ సంవత్సరం తయారుచేయుటకు ఆయా కోర్సులలో ప్రవేశ సీట్ల సంఖ్యను పెంచడమైనది. విజయనగరం జిల్లా గరివిడి నందు క్రొత్తగా పశువైద్య కళాశాల మరియు కర్నూలు జిల్లా బనవాసి నందు పశుసంవర్థక పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభిస్తాము.

**మౌలిక వసతుల కల్పన :** విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధన మరియు విస్తరణ రంగాలలో మౌలిక వసతుల అభివృద్ధి కొరకు రూ.135.50 కోట్లు మంజూరైనవి.

**పరిశోధన :** కర్నూలు జిల్లా బనవాసి నందు గొర్రెలు మరియు మేకల పరిశోధనా స్థానాన్ని స్థాపిస్తాం.

**విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతి :**

- ఆవిరిని పీల్చుకొని పనిచేయు పాల శీతలీకరణ యంత్రమును తయారుచేసి దానియొక్క పనితీరును పరీక్షించాము.
- పశువుల మరియు చేపల ఉత్పత్తులను నిలువ ఉంచుటకు వాయువు ఆధారిత శీతలీకరణ యంత్రాన్ని కనుగొన్నాం.
- చేపలు మరియు చేపల ఉత్పత్తుల కోసం పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ ఉపయోగిస్తాము.
- గొర్రెలకు కాలి గిట్టల వ్యాధి నిరోధక టీకా అభివృద్ధి చేసాము.
- ప్రొబయాటిక్‌తో సంపన్నం చేయబడిన పాల ఉత్పత్తులు అభివృద్ధి చేసాము.

**2016-17లో విశ్వవిద్యాలయపు లక్ష్యాలు :**

- పశుగణాభివృద్ధిలో రెండంకెల వృద్ధి సాధించుటకు గాను విశ్వవిద్యాలయము రైతులలో, క్షేత్రస్థాయి పశువైద్యులలో నైపుణ్యాభివృద్ధి కొరకు పెద్ద ఎత్తున శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడముతో పాటు ఆకాశవాణి మరియు దూరదర్శన్ ద్వారా కార్యక్రమాలు, కిసాన్ మేళాలు, పశువైద్య శిబిరాలు నిర్వహణ, ఒంగోలు మరియు పుంగనూరు జాతుల సంరక్షణా కార్యక్రమాలను కొనసాగింపు, గొర్రెలకు కాలిగిట్టల వ్యాధి నిరోధక టీకాలను వేయుట ఈ విశ్వవిద్యాలయపు ప్రధాన లక్ష్యాలు.

**2016-17 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ ప్రతిపాదనలు :**

విశ్వవిద్యాలయపు 2016-17 సంవత్సరానికి రూ. 139.92 కోట్ల ప్రణాళికేతర మరియు రూ. 40 కోట్లు ప్రణాళిక కింద ప్రతిపాదించబడినవి.

## మార్కెటింగ్ శాఖ :

1. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల సంక్షేమము కొరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెటింగ్ పాలసీ – 2015 ప్రకటించింది. ఈ నూతన పాలసీ ద్వారా సరళీకృత మరియు ఏకీకృత లైసెన్స్ విదానం, ఈ–మార్కెటింగ్, రైతుల సాధికారికత, సరళీకృత కాంట్రాక్టు ఫార్మింగ్ విదానం చేపట్టుటకై ఏర్పాట్లు జరుగుచున్నవి.
2. గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారిచేతుల మీదుగా తేది: 13.10.2015 మొదటి విడతగా 10 మార్కెట్లలో ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు, హిందూపూర్, కళ్యాణ్‌దుర్గం, కడప, గుంటూరు, దుగ్గిరాల,ఏలూరు మరియు అనకాపల్లిలలో ఇ–మార్కెటింగ్‌ను ప్రారంభించడమైనది. ఈ పది మార్కెట్లతో పాటు కొత్తగా పన్నెండు మార్కెట్లలో ఇ–మార్కెటింగ్‌ను ప్రవేశపెట్టి నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్‌నకు అనుసంధానించుటకై కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదించడమైనది.

## సహకారశాఖ

వ్యవసాయ మరియు తత్సంబంధిత రంగాల అభివృద్ధికి సహకార రంగం చాలా కీలకమైన పాత్ర పోషించుచున్నది. సహకార రంగానికి ప్రభుత్వం వారు వ్యవసాయ ఋణములు, ఇతర పెట్టుబడుల మరియు మార్కెటింగ్ సౌకర్యాలు కలిగించుట ద్వారా చేయూత అందచేస్తున్నది.

1. ఆప్కాబ్ 2015–16 సంవత్సరానికి గాను రూ. 5352.29 కోట్లు (ఖరీఫ్‌లో రూ. 4000.91 కోట్లు మరియు రబీలో రూ. 1351.38 కోట్లు) స్వల్ప కాలిక రుణాల క్రింద, రూ. 390.95 కోట్లు దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలను రైతులకు పంపిణీ చేయడమైనది.
2. 2015–16 సంవత్సరానికి గాను సమీకృత సహకార అభివృద్ధి పథకము క్రింద ప్రకాశం జిల్లాకు రూ. 7.85 కోట్లు ప్రభుత్వము మంజూరు చేసి విడుదల చేయడం జరిగినది.
3. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ వారు సమీకృత సహకార అభివృద్ధి పథకము (ఐసిడిపి) ఫేజ్ 2 క్రింద, 3 జిల్లాలో (తూర్పు గోదావరి, చిత్తూరు, కర్నూల్) **రూ. 158.99** కోట్లు మంజూరు చేసారు.

4. మార్క్‌ఫెడ్ ఇప్పటివరకు 7.5 లక్షల టన్నుల ఎరువులను రైతులకు పంపిణీ చేసింది. 2 లక్షల టన్నుల ఎరువులను స్థిర నిల్వ చేసే యున్నది. మార్క్‌ఫెడ్ ఇంకను ఈ సంవత్సరం 3.5 లక్షల టన్నుల మొక్కజొన్న మరియు 50,000 టన్నుల జొన్నలను రైతుల నుండి కొనుగోలు చేసింది.

5. 2016-17 సంవత్సరానికి గాను, మార్క్‌ఫెడ్ ద్వారా 7.80 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల వ్యాపారం మరియు 4.23 మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తుల సమీకరణ చేయుటకుగాను మరియు 1.66 లక్షల క్వింటాళ్ళు సెనగ మరియు వేరుసెనగ విత్తనాలను సబ్సిడీపై వ్యవసాయశాఖ ద్వారా రైతులకు పంపిణీ చేయుటకు ప్రతిపాదించుట జరిగింది.

## ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ. - వ్యవసాయశాఖతో అనుసంధానం :

MGNREGA ద్వారా రైతుల లబ్ధికోసం వ్యవసాయ, అనుబంధ శాఖల అనుసంధానాన్ని పొడిగిస్తూ నిధులను సద్వినియోగం చేసుకుని, వ్యవసాయ రంగాన్ని సుస్థిర పరచాలని ప్రణాళికలు తయారుచేశాం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 'నీరు-చెట్టు'పై ప్రధాన దృష్టి సారించింది. MGNREGA నిధులను ఉపయోగించుకొని వ్యవసాయం, వ్యవసాయ అనుబంధిత కార్యక్రమాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది.

వర్షాకాలంలో పడిన వర్షపునీటిని సంరక్షించడానికి పెద్ద ఎత్తున 'పంట సంజీవని'ని చేపట్టాము. అంతేగాక వర్షపునీటి సంరక్షణ విధానాలతో నీటిని భూమిలోకి ఇంకించవచ్చు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3.5 లక్షల ఫారం పాండ్లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నాం. 5 ఎకరాల లోపు పొలం ఉన్న రైతులకు ఎంజిఎన్ఆర్ఇజిఎ ద్వారా ఫారంపాండ్లు ఏర్పాటు చేయవచ్చు.

MGNREGAకేంద్ర వ్యవసాయం, అనుబంధరంగాల కోసం 2016-17 ఆర్థిక సంవత్సరానికి **రూ.5,094.83** కోట్ల వివరణాత్మక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. 2015-16 సంవత్సరంలో MGNREGA రూ.1904 కోట్లు ఖర్చు చేసింది.

## వ్యవసాయానికి విద్యుత్ సరఫరా

వ్యవసాయరంగానికి ఉచితంగా నాణ్యమైన మరియు విశ్వసనీయమైన విద్యుత్ సరఫరాను 7 గంటలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి వుంది. జనవరి 2016 నాటికి 15.70 లక్షల వ్యవసాయ సర్వీసులు ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని 7 జిల్లాలలోగల 46,727 వ్యవసాయ సర్వీసులకు వర్తింపచేయడానికి ప్రభుత్వం **రూ. 294.75** కోట్ల మొత్తం వ్యయంతో హై ఓల్టేజ్ పంపిణీ విధాన (HVDS) పథకాన్ని చేపట్టింది. పై ప్రయోజనం కోసం జెఐసిఎ **రూ. 251.58** కోట్ల మేరకు రుణసహాయాన్ని మంజూరు చేసింది. జనవరి, 2016 వరకు 27,637 వ్యవసాయ సర్వీసులకు వర్తింపచేస్తూ ఇప్పటివరకు **రూ.168.26** కోట్ల మొత్తాన్ని ఖర్చు చేసాం.

కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఇంధన సామర్థ్య సేవల లిమిటెడ్ (EESL) సహాయంతో ఐఎస్ఐ యేతర పంపుసెట్ల స్థానంలో ఇంధన సామర్థ్యంగల ఐఎస్ఐ పంపుసెట్లను అమర్చడానికి కూడా ప్రభుత్వం చేపట్టింది.

ఈ సంవత్సరానికి గాను ప్రభుత్వము బడ్జెట్‌లో రైతులకు ఉచిత విద్యుత్తు అందించుటకు రూ. **3000** కోట్లను ప్రతిపాదించాం.

**అధ్యక్షా!**

రాష్ట్రంలో వ్యవసాయ మరియు అనుబంధ రంగాల్లో ఉత్పాదకత పెంచి మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకొని మరియు లాభసాటిగా తయారుచేయటానికై ఈ బడ్జెట్ దృష్టి సారించింది. సేంద్రియ మరియు సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికై, వర్షాధార ప్రాంతాల్లో కరువు నివారణా పద్ధతుల్ని, దీర్ఘకాలంలో సుస్థిర వ్యవసాయ వృద్ధిని సాధించుటకై ప్రత్యేక ప్రయత్నాలు చేస్తున్నాం.

గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారి నాయకత్వంలో మా ప్రభుత్వం, రాష్ట్రంలో రైతాంగానికి అభివృద్ధి ఫలాలను అందిస్తూ, వ్యవసాయ మరియు అనుబంధ రంగాల సమగ్ర ప్రయత్నాల ద్వారా "ప్రాథమికరంగ మిషన్"లో భాగంగా, అధిక వృద్ధిరేటును సాధించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, దేశంలోనే ఉత్తమ రాష్ట్రాల్లో ఒకటిగా తీర్చిదిద్దడానికి, కట్టుబడి ఉంది.

ఇందుకు, మా ప్రభుత్వం ప్రత్యేక చొరవను చూపించి, 2016-17 ఆర్థిక సంవత్సరానికి, **రూ. 16250.58** కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నాము.

**ఇబ్బడి ముబ్బడిగా గింజల రాసులు**
**కొండలుగా ఎదగాలి...**
**కష్టాలూ.... కన్నీళ్లూ లేకుండా ప్రతీ రైతు ముఖంలో**
**చిరునవ్వులు ప్రతిబింబించాలి...**
**ఆత్మాభిమానం.. ఆత్మగౌరవంతో ఠీవిగా... హుందాగా**
**నిలబడిన రైతన్నకు కిరీటం తలపాగా....**
**దానికి అలంకరించిన ధాన్యపు కంకులే**
**అందరి కడుపు నింపే కల్పవృక్షం.**
**ఇటువంటి బంగారు రైతు భారతాన్ని సృష్టించడమే**
**చంద్రన్న సంకల్ప బలం...**
**మా ప్రభుత్వ ఆశయం... ఆచరణం.**

**అన్నదాతా! సుఖీభవ!!**

**జై కిసాన్!!**

❖ ❖ ❖